# జైహింద్
## –పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (ప్రారంభం)

*"యుద్ధంలో ఒక సైనికుని వీరత్వానికి కొలమానం అతను ఎలా చనిపోయాడన్నది కాదు, బ్రతికి ఉన్నంత సేపూ ఎలా పోరాడాడన్నదే ముఖ్యం."*

❦❦❦

ప్రస్తుతం...

బేగంపేట విమానాశ్రయంలో ప్రధానమంత్రి ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ల్యాండ్ అయింది.

రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి ఆయనకు ఆహ్వానం పలికారు.

రాష్ట్ర ప్రభుత్వం నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటానికి వచ్చాడాయన.

"అడగగానే అంగీకరించి వచ్చినందుకు ధన్యవాదాలు..." అన్నాడు ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి నమస్కరిస్తూ.

గుంభనంగా నవ్వాడు ప్రధానమంత్రి.

ఫార్మాలిటీగా పిలిచాడే తప్ప ఆయన ఇంత చిన్న కార్యక్రమానికి వస్తాడని ముఖ్యమంత్రి కూడా అనుకోలేదు. పైగా ప్రధానమంత్రి కార్యాలయం మధ్యాహ్నం వరకు మాత్రమే ఆయన షెడ్యూల్ పంపింది. సాయంత్రం నుండి ఆయన పాల్గొనబోయే కార్యక్రమాలు ఏమిటో ఇంకా ఎవరికీ తెలియదు.

అందరినీ నవ్వుతూ పలుకరించిన ప్రధానమంత్రి తన కారు ఎక్కాడు.

ఆయన వెనుక అందరు తమతమ కారుల్లో అనుసరించారు.

ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరి ఒక కారులో కూర్చుని ఉన్నారు. "ఏమయ్యా! ప్రధానమంత్రి సాయంత్రం ప్రోగ్రాం గురించి ఏమన్నా తెలిసిందా?" తన పక్కన కూర్చున్న చీఫ్ సెక్రటరీని మరోసారి అడిగాడు ముఖ్యమంత్రి. సాయంత్రం ఆయన ప్రోగ్రాం ఏమిటో తెలిసే వరకు ముఖ్యమంత్రికి కడుపు ఉబ్బరం తగ్గేటట్లు లేదు. అసలే అంతంత మాత్రపు మెజారిటీతో నడుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ప్రధానమంత్రి అనుకోవాలే గానీ తనను దింపి ఇంకొకరిని ఈ కుర్చీ మీద కూర్చో పెట్టటం పెద్ద విషయం కాదు.

"ఢిల్లీలో కూడా ఎవరికీ వివరాలు తెలియవు సార్. నాకు తెలిసిన వారినందరినీ అడిగాను. తెలిస్తే మనకు చెప్పకుండా పోరు..." అంటున్న చీఫ్ సెక్రటరీ వైపు అసహనంగా చూశాడు ముఖ్యమంత్రి. ఆయన విసుగు గమనించిన చీఫ్ సెక్రటరీ తడబడుతూ కొనసాగించాడు. "కాకపోతే... ప్రధానమంత్రి రక్షణ బాధ్యతలు చూసే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, మధురానగర్‌లోని ఒక వీధిని తమ ఆధీనంలోకి తీసుకున్నారని మన ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలిసింది. బహుశా ప్రధానమంత్రి అక్కడికి వెళ్తారేమో?"

"మధురానగరా? అక్కడ ఎవరున్నారు?"

"తెలియదు సార్. ఆ వీధిలో ప్రతి ఇంటి వివరాలూ సేకరించాం. వారంతా మధ్యతరగతి వారు. వారిలో ఎవరికీ రాజకీయాలతో సంబంధం లేదు. ఇక ప్రధానమంత్రితో పరిచయం ఉండే అవకాశమే లేదు."

ఇంతలో వారు చేరవలసిన ప్రదేశం సమీపించటంతో వారి సంభాషణ అంతటితో ఆగిపోయింది.

చేతిలో వాకింగ్ స్టిక్ పట్టుకుని అపార్టుమెంటు లిఫ్టు నుండి బయటకు వచ్చింది కాంచనమాల. ఆమెను చూడకుండా కేవలం పేరు విన్న ప్రతి ఒక్కరు, ముఖ్యంగా యువకులు ఒక అందమయిన అమ్మాయిని ఊహించు కుంటారు. అది కనక ఆమె గమనిస్తే, 'మీరు ఆరేడు దశాబ్దాలు ఆలస్యంగా పుట్టార్రా కుర్ర కుంకలూ...' అని ఎగతాళి చేస్తుంది. "ఆరేడు దశాబ్దాలా?" అని ఆశ్చర్యపోయిన వాళ్ళు, "మీ వయసెంత?" అని అడుగుతారు. అప్పుడు ఆమె చెప్పిన అంకె విని నోరు తెరుస్తారు.

ఆ వయసును రుజువు చేస్తున్నట్లు ఆమె శరీరం ముడుతలు పడిపోయి ఉంది. కళ్ల చుట్టూ చర్మం వదులు అయినా కళ్లల్లో మెరుపు తగ్గలేదు. ఆమె జుట్టును మగవారిలా క్రాపు చేయించుకుంది. జుట్టు మాత్రం తెల్లబడి పోయింది. చేతికర్ర అలంకారంలా ఉంది తప్ప ఆధారంలా లేదు. ఆమె నడకలో నెమ్మదితనం ఉంది తప్ప, నీరసం లేదు.

ఒక వారం క్రితం కొత్తగా పెళ్లయిన ముది మనవరాలి కాపురం చూడటానికి నగరానికి వచ్చింది ఆమె. పల్లెటూరులో ఎగిరే పక్షిలా కాలం గడిపే ఆమెకు, ఇక్కడ పంజరంలో పక్షిలా ఉండాలంటే ఏదోలా ఉంటోంది. 'నేను వెళ్లి పోతాను...' అంటే మనవరాలేమో, 'అప్పుడేనా...' అంటోంది. ఉదయాన్నే కొత్త జంట తమ పనుల మీద బయటకు వెళ్ళి పోతున్నారు. రాత్రి వరకు ఆమె ఒంటరిగా ఉండాల్సి వస్తోంది. అందుకని గత వారం రోజులుగా, ప్రతి సాయంత్రం వీధి

చివర ఉన్న పార్కుకు వెళ్ళి పొద్దుపోయే వరకు కూర్చుని రావటం మొదలు పెట్టింది. ప్రస్తుతం అదే పని మీద ఫ్లాటు నుండి బయటకు వచ్చింది ఆమె.

లిఫ్టు దిగిన ఆమె, అపార్టుమెంటు గేటు దాటి బయటకు రాబోతుంటే, “ఎక్కడికి బామ్మగారూ…” అంటూ వినవచ్చింది ఒక కంఠం. పక్కకు తిరిగి చూసింది కాంచనమాల. నిలువెల్లా నల్లటి యూనిఫాం ధరించిన ఒక వ్యక్తి వడివడిగా ఆమె దగ్గరకు వచ్చాడు. తనను తేరిపార చూస్తున్న ఆమెను పట్టించుకోకుండా మళ్లీ అదే ప్రశ్న వేశాడు.

“ఇంతకీ నువ్వెవరు?” అడిగింది ఆమె అతని ప్రశ్నను పట్టించుకోకుండా.

ఆమె వయసుకు గౌరవమిస్తూ అతను, “బామ్మగారూ… ఈరోజు ప్రధానమంత్రి గారు ఈ నగరానికి వచ్చారని తెలుసు కదా. మేము ఆయన రక్షణ దళంలోని కమాండోలం…” అని నెమ్మదిగా చెప్పాడు.

“ఆయన ఊర్లో తిరుగుతుంటే, మీరు ఈ మూల ఏం చేస్తున్నారు?”

“అవన్నీ మాకు ఏం తెలుస్తాయ్ బామ్మగారూ? ఎక్కడ డ్యూటీ వేస్తే అక్కడకు వెళ్లాలి.” అని, “ఇంతకీ మీరు నా ప్రశ్నకు మాత్రం సమాధానం చెప్పలేదు…” అన్నాడు.

“వీధి చివర పార్కు ఉంది. రోజూ సాయంత్రం అక్కడ కూర్చుంటాను…”

“ఈరోజు పార్కు మూసివేసి ఉంది బామ్మగారూ. మీరు అంత దూరం వెళ్లటం వృధా…”

దీర్ఘంగా నిట్టూర్చింది కాంచనమాల. “మీ ప్రధానమంత్రి నగరానికి రావటం వలన ఎవరికి ఏమి ఒరిగిందో కానీ, నాకు మాత్రం నా రెండు గంటల రిలీఫ్ పోయిందిరా అబ్బాయ్…” అంది.

“బామ్మా! నీ వయసు ఎంత?” అడిగాడతను. ఈ వయసులో నీకు ఇవన్నీ అవసరమా అన్న భావం ఆ మాటలో ఉంది.

“వంద ఏళ్లు.” అంటూ చాలా మామూలుగా చెప్పింది ఆమె.

పెద్దగా నవ్వాడతను. “మరీ అంత అభూత కల్పన ఎందుకు బామ్మగారూ… ఈ రోజుల్లో వందేళ్లు ఎవరు బ్రతుకుతున్నారు? ఎక్కడో కోటికి ఒకరు బ్రతికినా… ఏదో మంచం మీద ఉంటారు కానీ, ఇలా పార్కులకు వెళ్లటానికని రోడ్ల మీదకు వచ్చే ఓపిక ఉంటుందా?” అన్నాడతను. అతను ఆమె మాటలు నమ్మలేదని అతని గొంతులో ధ్వనిస్తున్న ఎగతాళి చెప్తోంది.

తను కూడా నవ్వేసింది కాంచనమాల. నిజానికి ఈ రోజు ఆమె వందవ పుట్టిన రోజు. ఆ విషయం ఆమెకు తప్ప, ఆమె కుటుంబీకులకు ఎవరికీ గుర్తు లేదు. తన ముది మనవరాలు సహా బంధువులెవరికీ తన పుట్టినరోజు గుర్తు లేనందుకు ఆమెకు ఏమీ బాధగా లేదు. పైగా అలా జరగటం ఇదేమీ మొదటిసారి కాదు కూడా. అందరూ గుర్తుంచుకోదగినంత ఘనకార్యం తను ఏమి చేసిందని తన పుట్టిన రోజును అందరూ గుర్తుంచుకోవాలి? అని ఆమె కూడా ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటుంది. కాకపోతే, తను ఈ ప్రపంచంలో ఉండాల్సిన దానికంటే ఎక్కువ సమయం ఉండి పోయానా?… అన్న

అనుమానం ఆమెకు ఈమధ్య ఎక్కువగా వస్తోంది. ఎక్స్పయిరీ డేట్ అయిపోతే ఎవరికీ పనికిరాని ఔషధంలా తను ఎవరికీ ఉపయోగపడకుండా ఉండిపోతున్నానా అన్న భావం బాధిస్తున్నా, తను ఏం చేయగలదు? అందుకే ఆమె మౌనంగా ఉండిపోయింది. ఒక్క క్షణం ఆగి వెను తిరగబోయింది.

ఏమనుకున్నాడో, ఏమో ఆమెను ఓదారుస్తున్నట్లు, "నిజంగా మీకు వందేళ్లు ఉన్నట్లయితే, ఈ వీధికి మీరే ప్రత్యేకం. ఆ మాటకు వస్తే, దేశంలోనే వందేళ్లు జీవించిన వారు అతి కొద్ది మంది ఉంటారు. ప్రధానమంత్రి నిజంగా ఇక్కడకు వచ్చేటట్లయితే, మిమ్మల్ని చూడటానికే ఇక్కడకు వస్తున్నారేమో. అంతకు మించి ఆయన ఇక్కడకు రావటానికి ఏ కారణం కనపడటం లేదు..." అన్నాడు.

హఠాత్తుగా ఆమె దృష్టి అతని నడుముకు ఉన్న హోల్‌స్టర్ మీద పడింది. అందులో నుండి అత్యంత అధునాతనమయిన 'గ్లాక్' కంపెనీ పిస్టల్ మెరుస్తూ కనిపిస్తోంది. దానిని చూడగానే ఆమెకు ఒక ఆలోచన వచ్చి తనలో తాను నవ్వుకుంది.

ఆమె పెదవుల మీద నవ్వు ఎందుకు విరిసిందో ఆ కమాండోకు అర్థం కాలేదు.

ఆమె ఒక అడుగు ముందుకు వేసింది. కింద నేల చదునుగా లేదేమో ఆమె కాలు స్లిప్ అయింది. తూలి కిందకు పడబోయింది ఆమె. అలాంటి ఘటనలకు వెంటనే స్పందించే ట్రైనింగ్ పొందిన కమాండో ఆమెను పట్టుకుని కింద పడకుండా ఆపాడు.

తేరుకున్న తరువాత "థాంక్స్..." అంది ఆమె. తరువాత అప్పుడే చూసినట్లు అతని పిస్టల్ వైపు చూసి, "నీ పిస్టల్ సేఫ్టీ క్యాచ్ ఎప్పుడూ అలా ఆన్ లోనే ఉంచుకుంటావా?" అంది అతనికి దాన్ని చూపిస్తూ.

ఉలిక్కిపడి హోల్‌స్టర్ వైపు చూసుకున్నాడతను. వాడాల్సిన అవసరం లేనపుడు దాన్ని అలా ఆన్‌లో ఉంచటం ప్రమాదానికి దారి తీయవచ్చు. అందుకే దానిని సరిచేసే ఉద్దేశంతో హడావుడిగా పిస్టల్ బయటకు తీయబోయాడతను. అతని కంగారులో అది అతని హోల్‌స్టర్ నుండి జారి పోయింది. సేఫ్టీ ఆన్‌లో ఉండి పిస్టల్ కింద పడితే ఆ అదురుకు ఫైర్ అయ్యే అవకాశం ఉంటుందని గుర్తుకు వచ్చి అతని గుండె గుభేలు మంది. అనుకోకుండా జరిగిన ఘటనకు అతను చేష్టలుడిగి నిలబడి పోయాడు. అయితే కాంచనమాల అలా ఊరుకోలేదు. ఆ పిస్టల్ కింద పడే లోపే చిటుక్కున కిందకు ఒంగి దానిని అందుకుంది. తప్పిపోయిన పిల్లవాడు సంవత్సరాల తరువాత దొరికితే ఆనందంతో తడిమినట్లు దానిని ఆప్యాయంగా ఒకసారి తడిమి చూసింది. ఒకే చేతిని వాడి మ్యాగజైన్ రిలీజ్ బటన్ ప్రెస్ చేసి కిందకు పడుతున్న మ్యాగజైన్‌ను రెండవ అరచేతితో పట్టుకుంది. కుడి చేతి చూపుడు వేలు ఆధారంగా ఆ ఆయుధాన్ని గిరగిర తిప్పి, గాల్లోకి ఎగరేసి సరయిన పొజిషన్‌తో తిరిగి పట్టుకుంది. తరువాత మ్యాగజైన్ పిస్టల్‌లోకి చొప్పించి, నోరు తెరచుకుని చూస్తున్న కమాండో చేతుల్లో పెట్టి తను అపార్ట్‌మెంటు లోకి వెళ్ళిపోయింది.

ఆ తరువాత ఎప్పటికో అతను తిరిగి ఆలోచించటం మొదలు పెట్టాడు. కిందకు పడిపోబోయినపుడు తను ఆమెను పట్టుకోవటం, ఆ తరువాతే తన పిస్టల్ సేఫ్టీక్యాచ్ గురించి ఆమె గమనించటం... ఇవన్నీ యాధృచ్ఛికం కాదేమో అని అప్పుడు అతనికి అనిపించింది.

ఆ తరువాత ఇంకో ప్రశ్న కూడా అతని మనసులో ఉదయించింది – 'ఇంతకీ ఈమె ఎవరు?' అని.

తనతో ఎవరూ రావటానికి వీలు లేదని ప్రధాన మంత్రి గట్టిగా చెప్పటంతో, ప్రముఖులందరు వెనుకే ఆగిపోయారు.

ఆఖరికి ఆయన కాన్వాయ్ ఆ వీధిలోకి ప్రవేశించిన తరువాత కూడా... ఆయన ఆ వీధిలో ఎక్కడకు వెళ్లాలనుకుంటున్నారో, ఏం చేయబోతున్నారో ఎవరికీ తెలియదు.

వీధిలో మోహరించిన కమాండోలు వీధిలో వాళ్లందరినీ ఇళ్లలోనే ఉండమనటంతో బయట ఎవరూ లేరు.

కారు దిగిన ఆయన ఆ వీధి తనకు చిరపరిచితమయినట్లు సరాసరి నడుచుకుంటూ కాంచనమాల ఉన్న అపార్టుమెంటు భవనం ముందుకు వచ్చాడు.

సెక్యూరిటీ వాళ్లు ముందు నలుగురు, వెనుక నలుగురు ఆయన్ని అనుసరించారు. ఆయన లిఫ్టు ఎక్కకుండా మెట్ల దారిన పైకి వెళ్లటం వారికి అనుకూలించింది. లేకపోతే ఆ చిన్న లిఫ్టులో ఆయన్ని అనుసరించటం అసాధ్యం అయ్యేది.

వయసు డెబ్భై దాటినా చకచక మూడు అంతస్తులు ఎక్కిన ఆయన కాంచనమాల ఉండే అపార్టుమెంటు ముందు నిలబడి కాలింగ్‌బెల్ కొట్టాడు.

కాంచనమాల ముది మనవరాలు తలుపు తీసింది. ఆమెకు ఎదురుగా ఉంది ఎవరో అర్థం చేసుకోవటానికి అర క్షణం పట్టింది. దేశ ప్రధానమంత్రి తన గుమ్మం ముందు నిలబడి ఉండటం ఏమిటో అర్థం కాక బొమ్మలాగా నిలబడి పోయింది.

తలుపు తీయటానికి వెళ్లిన భార్య ఎంతకీ రాకపోవటంతో, తలుపు దగ్గరకు వచ్చాడు ఆమె భర్త. అతను కూడా అదే పరిస్థితికి లోనయ్యాడు.

ప్రధానమంత్రి మాత్రం ప్రశాంతంగా నవ్వుతూ, "లోపలకు రావొచ్చా?" అన్నాడు. తరువాత, "మీరు ఇక్కడే ఉండండి..." అని సెక్యూరిటీ వారిని బయటే ఉంచేశాడు. "నువు నాతో రా..." అని ఒక సెక్రటరీకీ చెప్పి ఒక్కడే లోపలకు అడుగు పెట్టాడు.

"ఐ కాంట్ బిలీవిట్..." అంటోంది తలుపు తెరచిన యువతి.

ఆయన అవేమీ పట్టించుకోకుండా, "కాంచనమాల గారు ఎక్కడ?" అన్నాడు.

వారి ఆశ్చర్యం మరింత పెరిగింది. "మీకు మా బామ్మ ఎలా తెలుసు?" అని అడుగుతున్నారు వారు.

ఆయన ఏ సమాధానమూ చెప్పలేదు. ఆయన మొహం మీద నవ్వు కూడా చెదర లేదు.

ఈలోపు సెక్రటరీ హాలులోని ఒక టేబుల్ మీద పెద్ద కేకు పెట్టి, దాని మీద 100 అంకె ఉన్న కొవ్వొత్తులు వెలిగించాడు.

అప్పుడు ఆయన వారి వైపు చూసి, “ఈ రోజు మీ బామ్మ 100 వ పుట్టిన రోజు…” అన్నాడు.

ఇంతలో కాంచనమాల బయటకు వచ్చింది.

“బామ్మా! ఈరోజు నీ వందవ పుట్టిన రోజా?” అంటున్నారు ఆమె ఇంట్లోని కొత్త జంట.

ఈలోపు ఆమె కాళ్లకు నమస్కరించిన ప్రధానమంత్రి, “హ్యాపీ బర్త్ డే కాంచనమాల గారూ, నన్ను ఆశీర్వదించండి…” అన్నాడు. అతని తల మీద తన చేతిని ఉంచింది కాంచనమాల.

అందరూ ఆవిడకు హ్యాపీ బర్త్ డే చెప్పారు.

కాంచనమాల కూడా ప్రధానమంత్రిని ప్రత్యక్షంగా చూడటం ఇదే మొదటిసారి.

ఆయన దగ్గర ఉండి ఆమె చేత కేక్ కట్ చేయించాడు. మొదటి ముక్క తనే ఆమెకు పెట్టాడు.

సెక్రటరి ఫొటోలు తీశాడు. మరుసటి రోజు అవి అన్ని పత్రికలలో ప్రముఖంగా వస్తాయి. ఆ తరువాత సెక్రటరీ కూడా బయటకు వెళ్లి పోయాడు.

ఇల్లంతా కొద్దిగా ప్రశాంతత ఆవరించింది.

“ఏమిటిదంతా?” అంది కాంచనమాల ఆయన్ని కూర్చోపెట్టి.

“మా అమ్మ పేరు మధుబాల.”

“తెలుసు.”

“ఆమె అయిదేళ్ల క్రితం చనిపోయింది…”

“తెలుసు.”

“చనిపోయే ముందు ఆమె నాకు ఒక కవర్ ఇచ్చింది. దానిని ఎపుడు తెరవాలో తారీకుతో సహా దాని మీద రాసి ఉంది. ఆమె చెప్పినట్లు ఇన్ని రోజులు ఆగి, వారం క్రితం ఆ కవర్ తెరిచాను. అందులో మీ పుట్టిన రోజు గురించి రాసి ఉంది.”

ఈసారి కాంచనమాల ఏమీ మాట్లాడలేదు.

“మీ అమ్మగారికి, మా బామ్మ ఎలా తెలుసు? ఎక్కడో ఉత్తర్‌ప్రదేశ్‌లో పుట్టిన మీ అమ్మగారికి, ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన మా బామ్మకు పరిచయం ఉండే అవకాశం లేదే…” అంది కాంచనమాల ముది మనవరాలు.

“వారిది ఉత్త పరిచయం కాదు… వారి మధ్య ప్రాణ స్నేహం ఉంది. మా అమ్మ లేకపోతే నేను లేను. ఆ విషయం నాకు ఎప్పుడో తెలుసు. మీ బామ్మ లేకపోతే మా అమ్మ లేదు. ఆ విషయం మాత్రం ఈ మధ్యే తెలిసింది.” అన్నాడు ప్రధానమంత్రి.

'నిజమా?' అన్నట్లు చూశారు కాంచనమాల కుర్ర జంట.

"ఆ విషయాలు చాలా పాతవి. ఇప్పుడు వాటిని తిరిగి తవ్వుకోవటం అవసరమా?" అంది కాంచనమాల. ఆయన మాటలకు పెద్ద ప్రాముఖ్యత అవసరం లేదన్నట్లు ఉంది ఆమె వాలకం.

"మీకు అవసరం లేక పోవచ్చు. నాకు అవసరమే..." అన్నాడాయన.

"మధుబాల చనిపోయి కూడా అయిదేళ్ళు అయింది. మేము కొన్ని విషయాలు ఎవరికీ చెప్పకూడదనుకున్నాం. ఆఖరికి కుటుంబీకులకు కూడా. అయినా ఇప్పుడు ఆ విషయాలు చర్చకు పెట్టటం వలన ఎవరికి ఉపయోగం?" అంది కాంచనమాల.

"ఆ ఒప్పందం మీరు పందెం గెలవనంత వరకు మాత్రమే అని కూడా అందులో రాసి ఉంది. ఈరోజు మీరు పందెం గెలిచారు..." అన్నాడాయన.

కాంచనమాల కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి. "మేము ఎంతో మంచి భావనతో దేశం కోసం శ్రమిస్తే దాన్ని దేశ ద్రోహం అన్నారు. ప్రాణాలకు తెగించి పోరాడితే జైలుశిక్ష వేశారు. మా పోరాటానికి గుర్తింపు దొరకని కాలం అది. అందుకే, మా గతం గురించి తెలిస్తే ఎవరు ఎలా స్పందిస్తారో తెలియని కాలంలో, మేము మా విషయాలు రహస్యంగా ఉంచాలనుకున్నాం. అయితే ఎప్పటికయినా మంచి రోజులు వచ్చి మా త్యాగాలకు విలువ ఇచ్చే సమాజాన్ని చూడాలనే కోరిక మాకు కూడా ఉంది. అందుకే, మాలో ఎవరయినా వందేళ్ళు జీవిస్తే అప్పటికి సమాజం మారే అవకాశం ఉంది కాబట్టి, వారికి మాత్రం అన్ని విషయాలు బహిర్గత పరచే స్వేచ్ఛ ఉంటుందని అనుకున్నాం. దానిని గుర్తుంచుకోవటం ఆమె గొప్పదనం..." అంది నెమ్మదిగా.

"మీరు పోరాటంలో పాల్గొన్నారా?" అన్నాడు ప్రధానమంత్రి ఆశ్చర్యంగా. "ఏ పోరాటంలో?"

"మధుబాల నీకు కూడా చెప్పలేదా?" అంది కాంచనమాల.

"నువ్వు మాకు కూడా చెప్పలేదుగా..." అంది ఇంట్లోని యువతి.

కాంచనమాల ఎటో చూస్తూ, "ఏం చెప్పాలి? ఆడవాళ్లు ఇళ్లలో నుండి బయటకు రావటానికి అంగీకరించని రోజుల్లో మేము యుద్ధంలో పాల్గొన్నామని చెప్పాలా? మేము ఏ దేశ ప్రజల కోసం ఇదంతా చేశామో, వాళ్లే మమ్మల్ని నేరస్తులుగా చూశారని చెప్పాలా? అయినా ఆ రోజు యుద్ధంలో పాల్గొంది ఒక కాంచనమాలో, ఒక మధుబాలో మాత్రమే కాదు. వేలాది మంది పాల్గొన్నారు. ఇప్పటికీ సైన్యంలో ఆడవారు ఉండాలా, లేదా? ఒకవేళ వారికి అవకాశం ఇచ్చినా, ఫ్రంట్ లైన్ డ్యూటీలు చేయగలరా, లేదా? అని అనుమాన పడుతుంటే... అలాంటి అనుమానాలు అవసరం లేదని నమ్మి మా మీద పెద్ద బాధ్యత ఉంచాడు మహానుభావుడు."

"ఎవరాయన?" అడిగాడు ప్రధానమంత్రి.

"నేతాజీ సుభాస్ చంద్ర బోస్..."

"మీరు, మా అమ్మ నేతాజీ సైన్యంలో చేరి పోరాడారా?" తనకు ఆ విషయం అప్పుడే తెలిసినట్లు ఆశ్చర్యంగా అన్నాడు ప్రధానమంత్రి. "మా అమ్మ తను రాసిన లెటర్‌లో ఆ సంగతులేమీ చెప్పలేదు. నాకు ఆ వివరాలన్నీ చెప్పండి. ఊరికినే చెప్పటం మాత్రమే కాదు, ముందు తరాలకు తెలిసే విధంగా పుస్తకం రాయండి..." అన్నాడాయన.

కాంచనమాల ఏమీ మాట్లాడ లేదు. కాసేపటి తరువాత, "నేతాజీ సైన్యంలో పనిచేయటం ఒక నేరంగా భావించిన రోజుల్లో ఆ విషయం ఇక ఎవరికీ చెప్పకూడదని మేము నిర్ణయించుకున్నాం. తరువాత అది పాతబడి పోయింది. ఎవరికీ పనికిరాని విషయం అయిపోయింది. ఇప్పుడు చెప్పి మాత్రం ఏం సాధిస్తాం...?" అంది.

"వేలాది భారతీయ యువతుల వీరోచిత పోరాటం గురించి తెలుసు కోవటం ఇప్పటి తరాల బాధ్యత. మీరు చెప్పాల్సిందే..." అన్నాడాయన.

"అది ఒక గంటలోనో, ఒక రోజులోనో చెప్పే విషయం కాదు..." అంది కమలమ్మ. "అయినా, పుస్తకం రాయటం నా వలన అయ్యే పనా?"

"అయితే ఒక రచయితని మీతోనే ఉండే ఏర్పాటు చేస్తాను. మీరు చెపూ్త ఉండండి. అతను రాస్తూ పోతాడు..." అన్నాడాయన.

చాలాసేపు ఆలోచిస్తూ ఉండి పోయింది ఆమె. "నాదో చిన్న కోరిక ఉంది తీరుస్తారా?" అంది నెమ్మదిగా.

"చెప్పండి..."

"నాకు ఒకసారి ఆనాడు మేము కలిసి జీవించిన ప్రదేశాలను చూడాలని ఉంది. మరోసారి ఆ స్మృతులను గుర్తు చేసుకోవాలని ఉంది..."

"అన్ని సౌకర్యాలతో మీరు ఆ పర్యటన చేసే వీలు నేను కల్పిస్తాను. మీతో పాటు ఒక రచయిత కూడా ఉంటాడు. పనిలో పనిగా మీకు గుర్తు వచ్చిన విషయాలు అతనికి చెప్పండి. దాన్ని పుస్తక రూపంలో అతను రాస్తాడు..." అన్నాడు ప్రధానమంత్రి.

ఆమె ఏమీ మాట్లాడ లేదు.

ఆమె మౌనాన్ని అంగీకారంగా భావించాడు ప్రధానమంత్రి.

విమానం సింగపూర్ 'చాంగి' విమానాశ్రయంలో దిగటానికి ఆఖరి సన్నాహాలు చేసుకుంటోంది.

కిటికీ సీటులో కూర్చున్న కాంచనమాల విమానం కిటికీ నుండి కింద కనిపిస్తున్న సింగపూర్ నగరాన్ని చూస్తోంది.

ఆకాశ హర్మ్యాలతో, ఫ్లై ఓవర్లతో, పరుగులు తీస్తున్న మెట్రో రైళ్లతో, మెరిసిపోతున్న విద్యుత్ దీపాల కాంతులతో నగరం మెరిసి పోతోంది.

మారిపోయిన నగరాన్ని ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయింది ఆమె. "నాకు తెలిసిన సింగపూరుకూ, దీనికీ పోలికే లేదు..." అన్న మాటలు ఆమె నోటి నుండి అనుకోకుండా బయటకు వచ్చాయి. పక్కన కూర్చున్న యువకుడు ఆ మాటలు విన్నాడు. అతని పేరు మయాంక్. రచన మీద ఆసక్తితో కార్పొరేట్ ఉద్యోగం వదిలేశాడు. యువతరానికి నచ్చేలా అతను రాసిన రెండు రొమాంటిక్ నవలలు బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం ఈ పెద్దావిడతో పాటు తిరిగి ఆమె జ్ఞాపకాలను గ్రంథస్తం చేయమని సరాసరి ప్రధాన మంత్రి కార్యాలయం నుండి వచ్చిన సూచనను అనుసరించి ఆమెతో ప్రయాణం చేస్తున్నాడు. "మీకు తెలిసిన సింగపూర్... అంటే ఎన్ని సంవత్సరాల క్రితం?" అని కాంచనమాలను అడిగాడతను. అతని మాటల్లో ఆమె మీద గౌరవం ఉట్టిపడుతోంది. ఏదో మొహమాటానికి కాకుండా మనస్ఫూర్తిగా ఈ ప్రాజెక్ట్ చేపట్టాడు మయాంక్. దానికి మొదటి కారణం ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి అభ్యర్థించటం అయితే, రెండవ కారణం ఒక జీవించి ఉన్న వ్యక్తి దృష్టి కోణంలో ఆనాటి చరిత్రని చూడగలిగే అదృష్టం.

అతని ప్రశ్నకు సమాధానం ఇవ్వటానికి కొద్దిగా ఆలోచించిన కాంచనమాల, "నేను 1940 లో మొదటిసారి ఈ నగరానికి వచ్చాను..." అంది.

"అంటే దాదాపు 80 సంవత్సరాల క్రితం. ఆ రోజుల్లో విదేశాలు వెళ్లటం చాలా అరుదు కదా? అసలు మీరు ఇక్కడకు ఎందుకు వచ్చారు?" అడిగాడు మయాంక్.

ఆమె సమాధానం చెప్పేటంతలో విమానం ల్యాండ్ అయింది. ప్రయాణికులందరు హడావుడి పడుతూ దిగుతున్నారు. వీళ్లు కూడా నెమ్మదిగా దిగి బయటకు వచ్చేటప్పటికి వీరి కోసం ఒక కారు, దాని డ్రైవరు ఎదురు చూస్తున్నారు. ఇండియన్ హైకమీషన్ వీరి బస ఏర్పాట్లు అన్నీ చూస్తోంది. డ్రైవర్ వీరి సామాను కారులో పెట్టి సరాసరి హోటల్ దగ్గరకు తీసుకు వచ్చాడు.

అప్పటికే పొద్దు పోయింది. ఆమె బాగా అలసిపోయినట్లు ఉంది. "ఈ రాత్రికి విశ్రాంతి తీసుకోండి. ఉదయాన్నే కలుసుకుందాం..." అన్నాడు మయాంక్.

"ప్రశ్న అడిగావు. సమాధానం తెలుసుకోవాలని లేదా?" అంది కాంచనమాల.

"అంటే, ఇప్పటికే ఆలస్యం అయింది కదా అని..." అన్నాడతను. మళ్లీ ఏమనుకున్నాడో, "మీకు ఓపిక ఉంటే వినటానికి నాకు అభ్యంతరం లేదు." అన్నాడు.

"ఒక గంట ఆగి రా... రీ ఛార్జ్ అవటానికి నాకు ఆ సమయం చాలు." అంది ఆమె.

ఆమె చెప్పినట్లు మయాంక్ గంట తరువాత ఆమె గదిలోకి అడుగు పెట్టాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS